# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-11-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. గిరిజన వర్గాల అభివృద్ధి జాతీయ ప్రాధాన్యత అని భరత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.**

**2 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ లోని జుమూయ్ లో జరిగే జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలోఈ రోజు పాల్గొంటారు.**

**3. అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ఆరు విధానాలను రూపొందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**4. తెలంగాణ ప్రభుత్వం విద్యావ్యవస్థలో నూతన విధానాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**

**5. ఆంధ్రప్రదేశ్ లో రేపటి నుంచి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ శిక్షణను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు..**

=========================

గిరిజన వర్గాల అభివృద్ధి జాతీయ ప్రాధాన్యత అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. జన్‌జాతీయ గౌరవ దివాస్ సందర్భంగా రాష్ట్రపతి గత సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనులు కూడా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. జాతీయ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో గిరిజనులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని రాష్ట్రపతి వివరిస్తూ,

వాయిస్ ( 33 సెకన్లు)

-------------------------

జార్ఖండు ప్రాంతంలోని బిర్సా కొండల్లో విప్లవోద్యమాన్ని రేకెత్తించిన బిర్సా ముండా జయంతి ఈ రోజు. భగవాన్ బిర్సా ముండాగా ప్రసిద్దులైన ఈయన 1875 నవంబరు 15న జార్ఖండు ప్రాంతంలోని చోటా నగర్ సమీపాన ఓ కుగ్రామంలో జన్మించారు. సాంఘిక సంస్కరణల ఆవశ్యకత గురించి తెలుపుతూ, వనవాసిల జీవితాలలో వెలుగులు నింపేందుకు బిర్సా నిరంతరం శ్రమించారు. బ్రిటిష్ వారి అకృత్యాలపై తిరుగుబాటు చేసిన బిర్సా ముండా 1900 సంవత్సరం జూన్ 9న అశువులు బాశారు. దేశ స్వాతంత్ర్యం కోసం, బలిదానం చేసిన భగవాన్ బిర్సా ముండా జయంతిని కేంద్ర ప్రభుత్వం జన జాతీయ గౌరవ దివస్ గా నిర్వహిస్తోంది.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు  బీహార్ లోని జుమూయ్ లో జరిగే జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమం లో  పాల్గొంటారు. దర్తీ ఆభా భగవాన్ బిర్సా ముండా నూట యాభైవ జయంతి ఉత్సవాల సంధర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భగవాన్ బిర్సా ముండా గౌరవార్ధం స్మారక నాణెన్ని, స్మారక తపాలా బిళ్ళను ప్రధానమంత్రి విడుదల చేస్తారు. అదేవిధంగా గ్రామీణ మారుముల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, గిరిజనుల అభివృద్ధి కొరకు 6 వేల 640 కోట్ల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు.

----------------------------

అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను  తీర్చిదిద్దేందుకు  ఆరు విధానాలను రూపొందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ, ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్ పాలసీ, ప్రైవేటు పార్క్ పాలసీ, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులు పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసే వారికి  సహకారమందిస్తామని చెప్పారు.యువతకు  ఉద్యోగాలు  కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలుపుతూ

వాయిస్ ( 33 సెకన్లు)

----------------------------

తెలంగాణ ప్రభుత్వం  విద్యావ్యవస్థలో నూతన విధానాలను  అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.  ‘హైదరాబాద్ లోని  ఎల్బీ క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో  గత సాయంత్రం నిర్వహించిన.  బాలల దినోత్సవం లో  ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థులకు కలుషిత ఆహారం అందజేస్తే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత 10 నెలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 600 కోట్ల రూపాయలను ఖర్చు చేసి పాఠశాలల్లో మరమ్మతులు, కనీస సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. 5 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా యంగ్ ఇండియా సమీకృత పాఠశాలను  వచ్చే ఏడాదిలోపు అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి  తెలియజేశారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ లో  త్వరలో వెలువడనున్న మెగాడీఎస్సికి సంబంధించిన  శిక్షణ  తీసుకోవడానికి ఆర్ధిక స్థోమత లేని వారి కోసం బీసీ  స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత కొచింగ్ కేంద్రాలను ప్రారంభిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఒక ప్రకటనలో  తెలిపారు. రేపటి నుంచి 26 జిల్లా కేంద్రాల్లో  ఉన్న బీసీ స్టడీ సర్కిళ్ల లో  2 వందల మంది అభ్యర్థుల చొప్పున 5వేల 2 వందల మందికి  ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కేంద్రాల్లో బీసీలకు 66, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం చొప్పున ప్రవేశాలను  కేటాయించామని, వీరితో పాటు ఆర్థికంగా మరింత వెనుకబడిన ఈడబ్ల్యూఎస్  అభ్యర్థులకు మరో 520 సీట్లు అదనంగా కేటాయించామని మంత్రి తెలిపారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని  విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేసింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఈ మేరకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై మండలి ఛైర్మన్ అనర్హత వేటు నిర్ణయంపై  హైకోర్టులో పిటిషన్ వేయగా, మండలి ఛైర్మన్ నిర్ణయం  చెల్లదని, ఆయన  ఎమ్మెల్సీగా

కొనసాగవచ్చని తీర్పును వెల్లడించింది. దీంతో ఉపఎన్నిక నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు ఎన్నికల సంఘం ఈ మేరకు ప్రకటించింది.

---------------------------

ప్రయాణీకులు రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ – లఖనౌల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది ఈ ప్రత్యేక రైలు ఈ సాయంత్రం 7 గంటల 5 నిమిషాలకు సికింద్రాబాద్లో బయలుదేరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు లఖనౌ చేరుకుంటుంది అని తెలిపింది. తిరుగు ప్రయణంలో ఈ ప్రత్యేక రైలు 18వ తేదీన లఖనౌ లో ఉదయం 9 గంటల 50 నిమిషాలకు బయలుదేరి 20వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుటుందని వెల్లడించింది. ఈరైలు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, దువ్వాడ, విజయనగరం, భువనేశ్వర్, కటక్, గయ, వారణాసి, అయోధ్య మీదుగా లఖ్‌నవూ లో ఆగుతుందని పెర్కొంది.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన 30 శాతం పూర్తయిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ లో జరుగుతున్న గణన కార్యక్రమంలో భాగంగా నిన్న బంజారాహిల్స్ లో ఒక కుటుంబానికి సంబంధించిన వివరాలను మంత్రి నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రజలందరూ వివరాల నమోదుకు సహకరించాలని, అధికారులు తీసుకుంటున్న వివరాలు గోప్యంగా ఉంటాయని చెప్పారు. ప్రజల స్థితిగతుల్లో మార్పు తీసుకువచ్చి ఆదర్శవంతమైన పాలన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ గణన దోహదపడుతుందని మంత్రి వివరించారు.

---------------------------

సిక్కుల మత గురువు గురునానక్ జయంతి నేడు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజున గురు నానక్ జయంతిని జరుపుకుంటారు. సిక్కులకు ఇది అతి ముఖ్యమైన పండుగ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కులందరూ ఆయన జయంతి వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. గురునానక్ జయంతిని గురు పురల్ లేదా ప్రకాశ్ పర్వ్ అని కూడా పిలుస్తారు. ఈ సందర్భంగా దేశ విదేశాలలో ఉండే సిక్కులందరూ గురువుకు సంబంధించిన కీర్తనలు ఆలపిస్తారు.

---------------------------

వైద్య చికిత్స, ఫార్మా రంగంలో కృత్రిమ మేధ– ఏఐ ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందిందుకు ఈనెల 18న తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో 'ఏఐ ఇన్ హెల్త్‌కేర్' సమ్మిట్ నిర్వహింస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న సందర్భంగా నిన్న హైదరాబాద్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లైఫ్ సైన్సెస్ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు నూతన పరిశోధనలను ప్రోత్సహించేందుకు త్వరలోనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారం కారణంగా ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన సంస్థలు ఫార్మా ఉత్పత్తుల కేంద్రాలు, హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే

"మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================